ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 12.05.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో ఈరోజు ఏర్పాటు చేసిన 'జైలు అనుభవం' కార్యక్రమాన్ని, జైలు మ్యూజియాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు.

2. ధాన్యం సేకరణపై సీఎం రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. మిషన్ మోడ్‌లో ధాన్యం సేకరించాలని.. ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యతని సీఎం చెప్పారు.

3. హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజారోగ్య పరిరక్షణలో ముఖ్య భూమిక పోషిస్తున్న నర్సుల కృషిని సమాజం ఎప్పటికీ మరవదని మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు.

4. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల పెట్రోల్, బంగారం, ప్రజా రవాణ వినియోగంపై ప్రజలకు చేసిన విజ్ఞప్తిని ప్రతిపక్షాలు విమర్శించడం తగదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు.

5. రాష్ట్ర వ్యాప్తంగా హనుమాన్ జయంతిని ఘనంగా జరుపుకొంటున్నారు.

**గవర్నర్**

హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన 'జైలు అనుభవం' కార్యక్రమాన్ని, జైలు మ్యూజియాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా మ్యూజియాన్ని పరిశీలించిన ఆయన, జైలు అనేది కేవలం శిక్షా కాలం మాత్రమే కాదని, అది న్యాయం, పరివర్తనకు వేదికని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ పాలనలో భారతీయులు పడిన ఇబ్బందులను ఈ మ్యూజియం కళ్లకు కట్టినట్లు ప్రతిబింబిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఖైదీల సంస్కరణకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని గవర్నర్ వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు జైళ్ల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

BYTE ... GOVERNOR

DESK

**రేవంత్ రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్లతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలపై కీలక సమీక్ష నిర్వహించారు. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానిక వాహనాలను వినియోగించాలని, లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల తాలు, తరుగు పేరుతో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని స్పష్టం చేశారు. అకాల వర్షాల నేపథ్యంలో మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి, రైతులను నిరంతరం అప్రమత్తం చేస్తూ టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రం, రైస్ మిల్లు వద్ద పర్యవేక్షణ అధికారులను నియమించి మిషన్ మోడ్ లో పనిచేయాలని, ఏ చిన్న సమస్య తలెత్తినా కలెక్టర్లదే బాధ్యతని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**DESK**

**నాగర్ కర్నూల్-మంత్రి జూపల్లి**

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని మాతా శిశు సంరక్షణ ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనాన్ని మంత్రి

జూపల్లి కృష్ణారావు  ఈ రోజు ప్రారంభించారు. బస్టాండ్ నుంచి ఆసుపత్రికి వెళ్లే రోగుల రవాణా ఇబ్బందులను గమనించిన మంత్రి, ప్రత్యేక చొరవతో గుడ్ యూనివర్స్,  ఆర్సేసియం సేవా సంస్థల సహకారంతో ఈ వాహనాన్ని సమకూర్చారు. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే పేద రోగులకు ఈ ఉచిత రవాణా సౌకర్యం ఎంతో ఊరటనిస్తుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.  సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందుకు ముందుకు వచ్చిన సేవా సంస్థలను అభినందించారు.

(పీటీసీ, నాగర్ కర్నూల్)

**మంచిర్యాల-జనగణన**

మంచిర్యాల జిల్లాలో జనగణన 2027లో భాగంగా జరుగుతున్న ఇండ్ల గణన ప్రక్రియను అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌తో కలిసి ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్యుమరేటర్లు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు.

(పీటీసీ మంచిర్యాల జిల్లా)

**నర్సుల దినోత్సవ వేడుకలు**

ప్రజారోగ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న నర్సుల కృషిని సమాజం ఎప్పటికీ మరవదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో నిర్వహించిన వేడులకు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తో కలిసి హాజరైన మంత్రి నర్సులను సత్కరించారు. నిలోఫర్ ఆసుపత్రికి ఉన్న గొప్ప చరిత్రను గుర్తుచేస్తూ, రోగుల కోలుకోవడంలో వైద్యంతో పాటు నర్సుల సేవలు సగం పాత్ర పోషిస్తాయని మంత్రి కొనియాడారు. ఎంతటి ఒత్తిడిలోనైనా అంకితభావంతో పనిచేసే నర్సులు వైద్య రంగానికి వెన్నెముక అని, ముఖ్యంగా కరోనా సమయంలో వారు ప్రాణాలకు తెగించి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

(డెస్క్)

**రాంచందర్ రావు**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవల పెట్రోల్, బంగారం, ప్రజా రవాణ వినియోగంపై ప్రజలకు చేసిన విజ్ఞప్తిని ప్రతిపక్షాలు విమర్శించడం తగదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే ప్రధాని ఈ సూచనలు చేశారని స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, విదేశీ మారక ద్రవ్య నిల్వలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని గుర్తించి, ప్రజలందరూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని కోరారు. గతంలో జవహర్ లాల్ నెహ్రూ నుంచి ఇందిరా గాంధీ వరకు అనేకమంది ప్రధానమంత్రులు దేశ క్షేమం కోసం ఇలాంటి విజ్ఞప్తులు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వ్యక్తిగత క్రమశిక్షణే దేశ ఆర్థిక పురోభివృద్ధికి మూలమని, ప్రతి ఒక్కరూ ఈ పరిస్థితులను గమనించాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్, కె. నాగేశ్వర్ రావు, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

**BYTE … RAMCHANDAR RAO**

**(ఎంఎస్ఎం)**

**హనుమాన్ పెద్ద జయంతి**

హనుమాన్ పెద్ద జయంతి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరుగుతున్నాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్న ఆలయం భక్తజనసంద్రం కాగా, భక్తులు భారీగా పాదయాత్రగా తరలివచ్చి ఇరుముడి సమర్పించి మాల విరమణ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దక్షిణ అయోధ్య భద్రాచలంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పలు ఆలయాలను సందర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ భీమేశ్వర స్వామి, అగ్రహారం జోడు ఆంజనేయ స్వామి ఆలయాలకు మాలదారులు పోటెత్తి, మొక్కులు చెల్లించుకుని కొండగట్టుకు ప్రయాణమయ్యారు. ఆసిఫాబాద్ జిల్లా కేస్లాపూర్ ఆలయంలో ఎమ్మెల్యే కోవలక్ష్మి,

కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే హరీష్ బాబు దంపతులు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

(పీటీసీ, ఆసిఫాబాద్, సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం)

**నీట్ రద్దు**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, వైద్య విద్య అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 3వ తేదీన నిర్వహించిన నీట్ 2026 పరీక్షను రద్దు చేయాలని నిర్ణయించింది. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్టీఏ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ప్రశ్నపత్రం లీకేజీకి సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని CBI కి అప్పగించింది. ఈ దర్యాప్తుకు అవసరమైన పూర్తి సహకారాన్ని, రికార్డులను, సమాచారాన్ని బ్యూరోకు అందిస్తామని ఎన్టీఏ తెలిపింది. దీనిపై మరింత సమాచారం అందాల్సి ఉంది.

ఎన్.ఎస్.డి

**బండి సంజయ్-ఏక్తా యాత్ర**

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో కరీంనగర్‌లో నేడు 'హిందూ ఏక్తా యాత్ర' రగనుంది. రాజకీయాలకు అతీతంగా హిందువులను సంఘటితం చేసే లక్ష్యంతో 16 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ యాత్రకు శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ ముఖ్య అతిథిగా వస్తున్నారు. యాత్ర కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, భారీ సంఖ్యలో జనం తరలివస్తారని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు.

(పీటీసీ – కరీంనగర్)